
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 11 ఆగస్టు 2024



విభిన్న ప్రతిభావంతుల బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సదస్సులో పాల్గొన్న ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్, ఇతర న్యాయమూర్తులు, అధికారులు





చెత్తశుద్ధిలో.. అవినీతి కంపు

- స్వచ్ఛాంధ్ర ముసుగులో కోట్ల దోపిడీ
- రీసైక్లింగ్ పేరిట నకిలీ బిల్లుల సృష్టి
- మంగళగిరి, తాడేపల్లిలో భారీ కుంభకోణం
- కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు
- వెలుగులోకి వస్తున్న గత ప్రభుత్వ అక్రమాలు

మంగళగిరి, ఆగస్టు 10: మున్సిపల్ కేంద్రాల్లో అటు ప్రజలు ఇటు అధికారుల కు ప్రధాన సమస్య చెత్త శుద్ధి. వీధుల్లో పేరుకుపోయే చెత్త నిల్వలతో అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. అలాగే ఆ చెత్తా చెదారాల తొలగింపు మున్సిపాల్టీలకు ప్రధాన సమస్య. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో మాత్రం ఈ చెత్తశుద్ధితోనే రూ.కోట్లు కొట్టేశారు. వైసీపీ హయాం లో పాలకవర్గం లేకపోవడాన్ని అవకాశంగా తీసుకుని చెత్తను శుద్ధి చేసే పనుల్లో చిత్తశుద్ధిని పక్కనపెట్టి కుం భకోణానికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఉన్నతాధి కారుల నుంచి కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఈ అవినీతి భాగోతాన్ని నడిపించినట్టు విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో ఘనేశ్వర, ఆకాంక్ష, అవినాష్, తరుణి, సృష్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వ ర్యాన రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో చెత్తశుద్ధి పనులను చేపట్టాయి. చెత్తను ఆరబెట్టి, ఎండబెట్టి, పొడి చెత్తను ట్రోమాల్ మిషన్‌లో వేసి రీసైక్లింగ్ చేసి జిందాల్ ప్లాంటుకు తరలించాలి. కానీ, అవేవీ చేయకుండానే పనులు చేసినట్టుగా రికార్డుల్లో చూపించి నకిలీ బిల్లు లను సృష్టించి నిధులు దోచేశారనే ఆరోపణలు ఉన్నా యి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, మునిసిపల్ అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు కుమ్మక్కై బల వంతంగా ఫీల్డ్ కో ఆర్డినేటర్లతో పనులు పూర్తయినట్టుగా సంతకాలు పెట్టించినట్టు సమాచారం. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజరు రఘునాథరెడ్డి ఈ ఏడాది మేలో రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ తోపాటు మరో 8 మంది సిబ్బంది రాజీనామాలు చేయ డం చూస్తుంటే చెత్త రీసైక్లింగ్ పనుల్లో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలకు 2022లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విడివిడిగా టెండర్లను పిలిచారు. తాడేపల్లి పరిధిలోని ఎయిమ్స్ రోడ్డు కొలనుకొండ డంపింగ్ యార్డు, మంగళగిరి నిడమర్రు రైల్వే గేటు వద్ద చెత్త రీసైక్లింగ్ బయో మైనింగ్‌కు ఘనేశ్వర ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టెండర్లు దక్కించుకుని 2022 ఆఖర్లో పనులను ప్రారంభించింది. మంగళగిరి డంపింగ్ యార్డులో లక్షా 33 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగతా చెత్తను కొలనుకొండ వద్ద శర్వాణీ రెడీమిక్స్ ఎదుట ఉన్న 40 అడుగుల లోతు గుంతల్లో పోశారు. తాడేపల్లి కొలనుకొండ డంపింగ్ యార్డులో 95 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, సుమారు 20 వేల మెట్రిక్ టన్నులను మాత్రమే రీసైక్లింగ్ చేశారు. మిగిలిన చెత్తతో డంపింగ్ యార్డు ప్రాంతంలో పక్కనే ఉన్న గుంతలు, చెరువును పూడ్చివేసి చేతులు దులుపుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది, ఫీల్డ్ కోఆర్డినేటర్లు జరుగుతున్న అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా మున్సిపల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు మిన్నకుండి పోయారనే ఆరోపణలున్నాయి. రీసైక్లింగ్ అనంతరం ఎన్ని లారీల్లో చెత్తను గుంటూరులోని జిందాల్ ప్లాంటుకు తరలించారో సరైన సమాచారం లేదు. వంద శాతం పనులను పూర్తిచేసినట్లు చూపించి బిల్లులను రాబట్టుకున్నారు. కాంట్రాక్టర్లు, అధికార యంత్రాంగం, వైసీపీ ప్రజాప్రతినిధుల కుమ్మక్కై చేసిన ఈ చెత్త రీసైక్లింగ్ ప్రక్రియ కుంభకోణంలో సుమారు రూ.9కోట్ల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ దోపిడీలో ఓ ఇంజనీరింగ్ అధికారికి రూ.20 లక్షలు ముట్టినట్టుగా సమాచారం. అప్పటి పట్టణాభివృద్ధి శాఖ చీఫ్ సెక్రెటరి శ్రీలక్ష్మీ ప్రమేయంతోపాటు మంగళగిరి మా జీ ఎమ్మెల్యే బంధువు అనధికార పార్టనర్‌గా వ్యవహరించినట్లు తెలిసింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించి పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంటీఎంసీలో విజిలెన్స్ విచారణ?

- గత ఐదేళ్ల అభివృద్ధి పనుల ఫైళ్లు స్వాధీనం

మంగళగిరి: వైసీపీ పాలనలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ(ఎంటీఎంసీ)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయానికి విజిలెన్స్ అధికారుల బృందం చేరుకుని అనేక ఫైళ్లను తీసుకువెళ్లినట్లు తెలిసింది. గత 2019 నుంచి 2024 ఎన్నికల వరకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లను విజిలెన్స్ బృందం పరిశీలించనుంది. ఐదేళ్ల పాలకవర్గం లేకపోవడంతో అప్పటి వైసీపీ ముఖ్యనేత ఏకచత్రాధిపత్యం చెలాయించారు. అప్పట్లో అభివృద్ధి పనులకు విపరీతమైన అంచనాలు వేయించడంతోపాటు టెండర్లు లేకుండా పనులను జరిపించడం, పనులు పూర్తయ్యాక మొక్కుబడిగా టెండర్లను పిలవడం వంటి అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ప్రైవేటు కాంట్రాక్టర్లచే టెండర్లపై చేయించాల్సిన పనులను సైతం మున్సిపల్ శానిటరీ వర్కర్లతో జరిపించి ఆ సొమ్ములను కూడా జేబుల్లో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని నిగ్గు తేల్చేందుకు కొత్త ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

- ఎక్కువగా తెలిసిన వారే లైంగిక దాడి
- బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో వక్తలు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బాలలపై దాడులు జరగడం అవాంఛనీయం. వారి హక్కుల పరిరక్షణకు అందరూ నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలి. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. లైంగిక దాడుల్లో ఎక్కువగా తెలిసిన వారి వలనే జరుగుతుండటం బాధాకరం.. అని బాలల హక్కుల పరిరక్షణపై జరిగిన సదస్సులో పలువురు వక్తలు తెలిపారు. ఏపీ హైకోర్టు(జువనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతుల బాలల హక్కుల పరిరక్షణపై శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేక అవసరాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి వారికి బహుమతులు అందించారు. సభలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తొలుత ప్రసంగించారు. ఎన్‌సీఆర్‌బీ రికార్డుల ప్రకారం లైంగిక దాడులు జరిగిన 1004 కేసుల్లో 900 కేసులు తెలిసిన వారి వల్ల జరిగినవేనంటూ చీఫ్ జస్టిస్ భావోద్వేగానికి లోనయ్యారు. బాలలు బలహీనులు ఏమి చేయలేరు ఎవరికి చెప్పుకోలేరు అని అనుకుని వారిపై లైంగిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న బాలలకు కూడా రక్షణ సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జువనైల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ మాట్లాడుతూ బుద్ధిహీనమైన చర్యలకు బాధితులుగా మారిన పిల్లలకు ప్రభుత్వం కల్పించిన హక్కులను పరిరక్షించడానికి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జువనైల్ జస్టిస్ కమిటీ సభ్యుడు, హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మాట్లాడుతూ బాలలెవరినీ సంక్షేమానికి దూరంగా వదిలేయకూడదన్నారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ పిల్లల్లో వైకల్యాలను ముందుగానే గుర్తించేందుకు అన్ని కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సెక్రటరి కన్నబాబు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విభిన్న ప్రతిభావంతులైన బాలలకు అడ్మిషన్లతో పాటు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎల్‌జీబీటీక్యూఐ ఏ ప్లస్ థర్డ్ జెండర్ వారికి కూడా మిగతా బాలల మాదిరిగా విద్య, ఉద్యోగ విషయంలో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఎయిమ్స్ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఏ విజయచంద్రారెడ్డి, యునిసెఫ్ ప్రతినిధి సోనీజార్జ్ కుట్టీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు తల్లిదండ్రులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బీ శ్రీనివాసరావు తమ శాఖల కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ డైరెక్టర్ ఎం రఫీక్, గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ జగదీష్‌బాబు, జువనైల్ జస్టిస్ కమిటీ సభ్యులు జస్టిస్ కిరణ్మయి మండవా, జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వీ సుజాత, తిరుపతి జువనైల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు సంధ్యారాణి, ఏపీ లీగల్ సెల్ అథారిటీ మెంబరు సెక్రటరి ఏ భవిత, జిల్లా జడ్జి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ సెక్రటరి ప్రసన్న కుమార్ వెంకటేష్, గుంటూరు లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరి లీలావతి, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరి భార్గవి, జిల్లా న్యాయమూర్తులు, డీసీపీఓలు, న్యాయవాదులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నారు కోసం వరి విత్తనాలు చల్లిన పొలం

పొలాల కౌలుకు.. పోటాపోటీ

- గణనీయంగా ధరల పెరుగుదల
- వరి ఎకరాకు 10 నుంచి 14 బస్తాలు
- మిరప భూములకు గరిష్ఠంగా రూ.40 వేలు
- ఒప్పందాలు పూర్తి.. సాగు పనుల్లో కౌలు రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మ ఉప్పొంగగా సాగర్ జలాశయం నిండింది. కుడి కాల్వకు నీటిని పుష్కలంగా సరఫరా చేస్తున్నారు. 15 రోజుల్లో సాగర్ ఆయకట్టు సాగు చిత్రం పూర్తిగా మారిపోయింది. ఇటీవల వరకు సాగుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు కొన్ని రోజులుగా సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. ముమ్మరంగా సాగు పనులు సాగుతున్నాయి. ఇదే సమయంలో కౌలు రైతులు పొలాలను కౌలుకు తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. దీంతో గత ఐదేళ్లుగా లేనివిధంగా కౌలు ధరలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు గరిష్ఠంగా కౌలు 14 బస్తాలు పలుకుతున్నది. ఏటా పత్తి సాగు చేసే పొలాల్లో అనుకూలమైన వాటిలో ఏడాది వరి సాగుకు సిద్ధమయ్యారు. దీంతో ఈ ఏడాది భూ యజమానులకు లబ్ధి చేకూరేలా కౌలు ధరలు ఉన్నాయి. ఇప్పటికే కౌలు ఒప్పందాలు పూర్తి చేసుకుని కౌలు రైతులు సాగు పనులు చేపట్టారు. సాగర్ ఆయకట్టులో 2019 నుంచి కౌలు పరిశీలిస్తే ఈ ఏడాదే అధికంగా ఉందని అర్థమ వుతోంది. కొన్నేళ్లుగా వరి సాగుకు రైతులు ఆసక్తి చూప లేదు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది వరకు ఎకరా కౌలు రెండు నుంచి 5 బస్తాల వరకు మాత్రమే ఉంది. వరి సాగు చేయక 2020, 2021 సంవత్సరాల్లో వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. ఈ ఏడాది ఆ పరిస్థితి నుం చి భూ యజమానులు గట్టెక్కారు. ఈ ఏడాది ముందు గా సాగర్ కాల్వకు నీరు విడుదలతో వరి సాగు వైపు కౌలు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కౌలు ధరలు పెరిగాయి. వరి సాగుకు ఎకరాకు కొన్ని ప్రాం తాల్లో 10 నుంచి 12 బస్తాలు, మరి కొన్ని ప్రాంతాల్లో 12 నుంచి 14 బస్తాల వరకు కౌలు ఒప్పందాలు జరి గాయి. వరి సాధారణ విస్తీర్ణం 1.05 లక్షలు. కాగా నీరు పుష్క లంగా సరఫరా అవుతుండటంతో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా.

గత ఏడాది కంటే పెరిగిన మిర్చి కౌలు

ఆయకట్టులో మిరప సాగు చేసే పొలాలకు గత ఏడాది కంటే ఈ ఏడాది కౌలు పెరిగింది. గత ఏడాది సాగు నీరు లేక పోవడంతో వర్షాధారంపై మిరప సాగు చేశారు. ట్యాంకర్ల ద్వారా మిరపకు తడులు ఇవ్వాల్సి రావడంతో నీటి ఖర్చు అధికమైంది. ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదని మిర్చి సాగుకు కౌలు ఒప్పందాలకు రైతులు పోటీ పడ్డారు. నీటి వసతి ఉన్న పొలాల్లో మిరప సాగుకు కౌలు డిమాండ్ ఉంది. ఎకరాకు కొన్ని ప్రాంతాల్లో రూ.30 నుంచి 35 వేలు, మరి కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.40 వేల వరకు కౌలు ధర పలికింది. 2022లో 1,39,922 ఎక రాల్లో 2023లో 1,25,881 ఎకరా ల్లో మిర్చి సాగు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని తెలుస్తోంది.

పత్తి సాగుకు అంతంతే..

వరి, మిరప సాగు వైపే రైతులు మొగ్గు చూపుతు న్నారు. దీంతో పత్తి పొలాలకు కౌలు అంతంత మాత్రం గానే ఉంది. వరుసగా నాలుగేళ్లు పత్తి సాగు చేసిన రైతు లు దారుణంగా నష్టపోయారు. అధిక వర్షాలు, గులాబి పురుగు, వైరస్ తెగుళ్లతో పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. పత్తి పంట దెబ్బ తినడంతో సాగు సగంలోనే పత్తి పీకేసి మొక్కజొన్న సాగు చేశారు. దీం తో ఈ ఖరీఫ్‌లో పత్తి సాగుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కూడా పత్తి సాగు తగ్గు తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. జిల్లాలో గత ఏడాది పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 3,04,052 ఎక రాలు కాగా ఈ ఏడాది అది 2,67,965 ఎకరాలకు వ్యవసాయ శాఖ తగ్గించింది. అయితే ఇంత కన్నా తక్కువగానే పత్తి సాగ య్యే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటి వరకు 92,240 ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేసి నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

కౌలు రైతులకు కార్డులు అందేనా?

ఈ ఏడాది కౌలు రైతుల సంఖ్య పెరగను న్నది. అయితే కౌలు రైతులకు సకాలంలో కార్డులు అందిం చే విషయంలో ప్రభుత్వ చర్యలు నామమా త్రంగానే ఉన్నాయి. 65 వేల మంది కౌలు రైతులకు కార్డులు పంపిణీ లక్ష్యం అని వ్యవ సాయ శాఖ వెల్లడించింది. అయితే లక్ష్యం మేర కార్డులు అందించేం దుకు క్షేత్ర స్థాయిలో అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు న్నాయి. సాగుకు బ్యాంకు రుణం కోసం కూడా కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు.



వరి నారు సాగు పొలం దమ్ము



కుప్పుస్వామి విగ్రహావిష్కరణలో పాల్గొన్న వెంకయ్యనాయుడు, పురంధేశ్వరి, కామినేని శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఏలూరి సాంబశివరావు

విద్యాదాత కుప్పుస్వామి

- విద్యాదానం గొప్పదని నిరూపించారు
- విగ్రహావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పర్చూరు, ఆగస్టు 10: అన్నదానం కన్నా.. విద్యాదానం గొప్పదని నిరూపించిన మహనీయుడు జాగర్లమూడి కుప్పుస్వామి అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. విద్యాదాత, రాజకీయవేత్త, స్వర్గీయ కుప్పుస్వామి కాంస్య విగ్రహ ఆవిష్కరణ బాపట్ల జిల్లా కారంచేడులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు పల్లెలు వైపు చూడని సమయంలో కుప్పుస్వామి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నతులన్నారు. పదవి పదిమంది మేలు కోసమని, తోటివారికి సాయపడడమే జీవిత పరమార్థమని నమ్మి నిరూపించిన వ్యక్తి కుప్పుస్వామి అని కొనియాడారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కారంచేడు ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన వ్యక్తి కుప్పుస్వామి అని తెలిపారు. తెలుగుభాష, ఆలయాల పునరుద్ధరణ, కవిగా, విద్యాదాతగా కుప్పుస్వామి ఎన్నో సేవలందించారన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ కుప్పుస్వామి సేవలు చిరస్మరణీయమని, విద్యాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషిచేశారన్నారు. ఇలాంటి వ్యక్తులు బావితరాలకు దిక్సూచి వంటి వారని కొనియాడారు. కుప్పుస్వామి సేవలను కుటుంబ సభ్యులు నేటికీ కొనసాగించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి దుగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకుడు బండారుపల్లి హేమంత్‌కుమార్‌తో పాటు జాగర్లమూడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం దగ్గుబాటి దంపతుల ఆహ్వానం మేరకు వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే ఏలూరి వారి నివాసానికి వెళ్లి తేనీటి విందును స్వీకరించారు.

కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

- డీసీసీబీ పరిశీలనలో జేసీ భార్గవతేజ ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 10: సహకార బ్యాంకుల్లో కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని జేసీ, జీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి భార్గవతేజ ఆదేశించారు. సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మంగళగిరి, వరగాని, తాడికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఇందులో భాగంగా జేసీ శనివారం బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంకు కార్యాలయాన్ని సందర్శించి కంప్యూటరీకరణను స్వయంగా పరిశీలించారు. సహకార సంఘాలలో సభ్యుల నుంచి తక్షణమే కేవైసీ పొంది సభ్యత్వ రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. బ్యాంకు అధికారులకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో కృష్ణవేణి, జనరల్ మేనేజర్లు వీవీఎస్ ఫణికుమార్, కే మాధవి, క్లస్టర్ ఏజీఎమ్ మురళీకృష్ణారెడ్డి, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది ఉన్నారు.



జీడీసీసీ బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ భార్గవతేజ

16 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు

- భూ వివాదాలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం
- వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాల పైనా దృష్టి కేంద్రీకరణ
- 22ఏ భూముల స్వతంత్రతలో జరిగిన అక్రమాలపై చర్యలు

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్ పనులు

- చెదురుమదురు వర్షాలు పడుతున్నా కొనసాగుతున్న పనులు

26 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



6లో..

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ దస్తగిరి



వైసీపీ కౌన్సిలర్ దస్తగిరిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 10: పట్టణంలోని 26వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ దస్తగిరి టీడీపీలో చేరారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గృహంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి టీడీపీ కండువా కప్పి దస్తగిరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో షేక్ మదార్‌సాహెబ్ పాల్గొన్నారు. పురపాలక సంఘ ఎన్నికల్లో పట్టణంలోని మొత్తం 31 వార్డులను వైసీపీ ఏకగ్రీవం చేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి రావడంతో పదిమంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా మరో పదిమంది వైసీపీ కౌన్సిలర్లు కూడా త్వరలోనే టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య గణనీయంగా పెరిగి మున్సిపల్ చైర్మన్ సీటును కూడా కైవసం చేసుకునే దిశగా టీడీపీ పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్ పనులు

● చెదురుమదురు వర్షాలు పడుతున్నా కొనసాగుతున్న పనులు



రాజధాని అమరావతిలో కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

తుళ్లూరు, ఆగస్టు 10: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలు వర్షంలో కూడా కంపచెట్లను పీకి పారేస్తున్నాయి. క్లియరెన్స్ పనులకు ఎన్‌సీసీ కంపెనీ టెండర్‌ను దక్కించుకున్న సంగతి తెలిసిందే. 26వేల ఎకరాలలో ఈ పనులు జరగాల్సివుంది. అధికసంఖ్యలో యంత్రాలు ఇప్పటికే పనులు ముమ్మరంగా చేస్తున్నాయి. జోన్‌ల వారీగా ఎన్‌సీసీ కంపెనీ పనులు వేగవంతం చేస్తున్నది. రాజధాని అమరావతిలో ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి కోసం తట్ట మట్టి వేయలేదు. అంతేగాక రాజధానికి రైతులిచ్చిన 33వేల ఎకరాల భూములను అడవిలాగా మార్చింది. ఇప్పుడు జంగిల్ క్లియరెన్స్ కోసం ఖర్చు చేస్తున్న రూ.33.5 కోట్లు జగన్‌రెడ్డి నిర్లక్ష్యం ఫలితమేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులలో పనులు పూర్తికావాలని టెండర్ ప్రక్రియలో ఉంది. అందుకు తగ్గట్టుగా ఏజన్సీ కంపెనీ యంత్రాలను రంగంలోకి దించుతున్నది. ఇంకా యంత్రాలు రంగంలోకి దిగుతూనే ఉన్నాయి.

16 నుంచి 30 వరకు రెవెన్యూ సదస్సులు

● భూ వివాదాలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం

● వైసీపీ హయాంలో జరిగిన భూకబ్జాల పైనా దృష్టి కేంద్రీకరణ

● 22ఏ భూముల స్వతంత్రతలో జరిగిన అక్రమాలపై చర్యలు



గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం తర్వాత రెవెన్యూ సదస్సులు మళ్లీ జరగబోతున్నాయి. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు గ్రామగ్రామాన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అందుకు అవసరమైన ప్రణాళికని రూపొందించుకోవాలని సూచించింది. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య లక్ష్యం. సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులతో బృందాలను నియమించి ప్రతీ రెవెన్యూ గ్రామంలో పర్యటించి ముఖ్యంగా భూ ఆక్రమణ, సెక్షన్-22ఏ తారుమారుకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తారు. ఆ అధికారే షెడ్యూల్ గ్రామ/మండల స్థాయి ఫిర్యాదుల స్వీకారం, పరిష్కారాలను ఫైనల్ చేస్తారు. అన్ని ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్ జీఆర్‌పీలో నమోదు చేస్తారు.

ఆగస్టు 15న లాంఛనంగా సదస్సులను జిల్లా మంత్రి ప్రారంభిస్తారు. సదస్సులకు కో-ఆర్డినేటర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారు. సబ్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లను షెడ్యూల్ రూపొందించి ఈ నెల 13వ తేదీ లోపు తనకు నివేదించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఎక్కువ విస్తీర్ణం కలిగిన గ్రామాలకు అయితే ఒక రోజంతా సదస్సుల నిర్వహణకు కేటాయిస్తారు. ఇతర గ్రామాలకు ఒక పూట కేటాయిస్తారు.

సదస్సులపై ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ స్థాయి బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌వో, సర్వేయర్, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ, వక్ఫ్‌బోర్డుల నుంచి ప్రతినిధులు ఉంటారు. పోలీసు సెక్యూరిటీ కూడా ఉంటుంది. ప్రతీ మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ నియమిస్తారు.

సదస్సుకు వెళ్లేటప్పుడు గ్రామ చిత్రపటాలు, ఆర్‌వోఆర్ 1-బి/అడంగల్ పహాని/ప్రభుత్వ భూమి కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించినవి తీసుకొని వస్తారు. ప్రతీ గ్రామంలో ఉదయం 9 గంటలకే రెవెన్యూ సదస్సుని ప్రారంభిస్తారు. పిటీషన్లకు సంబంధించి తహసీల్దార్ విచారణ, రీసర్వే, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ఏవైనా సర్వే హద్దురాళ్లపై ఎవరివైనా పేర్లు, బొమ్మలుంటే వాటిని చెరిపేయడం వంటివన్ని చేపడతారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 22ఏ భూములు, అసైన్‌మెంట్ ల్యాండ్స్‌ని జిల్లాలో 670 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్(స్వతంత్రం) చేశారు. ఇది కచ్చితంగా వైసీపీకి చెందిన వారికి మేలు చేయడానికేనన్న ఆరోపణలు ఉన్నాయి. వీటి బండారాన్ని కూడా సదస్సుల ద్వారా బయటపెట్టి చర్యలు తీసుకోనున్నారు. నవంబరు 15వ తేదీ కల్లా ఫిర్యాదుల పరిష్కారం కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. సదస్సుల నిర్వహణ కోసం ప్రతీ జిల్లాకు రూ.8.10 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది.

ఆఫ్రికన్ వైద్యులకు మోకీలు మార్పిడిపై శిక్షణ

● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడి



అంగోలా యువ వైద్యులతో డాక్టర్ నరేంద్ర రెడ్డి

గుంటూరు (మెడికల్), ఆగస్టు 10: ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇకపై సాయి భాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆఫ్రికా దేశాల్లో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజుల పర్యటన అనంతరం శనివారం డాక్టర్ నరేంద్రరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. అంగోలా దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పౌల లుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలి రివిజన్ నీరీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నాలుగు రోజులపాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు రివిజన్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలపై శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సూచన మేరకు అక్కడి యువ వైద్యులకు గుంటూరులోని సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్లపై శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘంతో తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన ప్రకటించారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనున్నదని ఆయన తెలిపారు.


ఏఎన్‌యూ బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా డాక్టర్ వెంకట శివలక్ష్మి



డాక్టర్ వెంకట శివలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 10: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ చైర్మన్‌గా ఆర్‌వీఆర్ విద్యా కళాశాల లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. గత 22 సంవత్సరాలుగా ఫిజిక్స్ లెక్చరర్‌గా బోధనారంగంలో రాణించారు. ప్రస్తుతం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నారు. ఎంఈడీ థీసెస్‌లో 10 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. గతంలో కొన్ని విశ్వవిద్యాలయాల్లో బీఈడీ ప్రశ్నాపత్రాల రూపకల్పనలోనూ తన వంతు పాత్ర పోషించారు. బీఈడీకి సంబంధించిన పలు పుస్తకాలకు రచయితగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శివలక్ష్మి మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో మెరుగైన విద్యా విధానానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన టీడీపీ ప్రజాప్రతినిధులకు, ఏఎన్‌యూ అధికారులకు శివలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా తన వంతు బాధ్యతలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ శివలక్ష్మి నియామకం పట్ల బీఈడీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మాచర్ల రూరల్, ఆగస్టు 10: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా ప్రాజెక్ట్ అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. 16 క్రస్ట్‌గేట్లను 10 అడుగులు, 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 588.00 అడుగులు ఉంది. ఇది 306.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3597 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,12,756, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,55,549 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,55,549 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ముగిసిన లీగ్.. నేడు క్వార్టర్, సెమీ ఫైనల్స్

● ఉత్కంఠగా సాగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న విశాఖపట్టణం- కడప జట్లు

వినుకొండ, ఆగస్టు 10: పట్టణంలోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో లీగ్ దశ ముగిసి ఆదివారం క్వార్టర్ ఫైనల్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి మొత్తం 26 పురుషులు, మహిళా జట్లు పాల్గొన్నాయి. మహిళల విభాగంలో. లీగ్ దశలో పోటీపడిన టీమ్‌లలో విజయనగరం, తూర్పుగోదావరి, కడప, అనంతపురం, కర్నూల్, శ్రీకాకుళం, విశాఖపట్టణం, కృష్ణ, విజయనగరం, గుంటూరు, కడప జట్లు గెలుపొందాయి. లీగ్ దశలో పోటీపడిన ఈ 11 జట్లలో కడప, విశాఖపట్టణం, గుంటూరు, శ్రీకాకులం జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరున్నాయి. అదేవిదంగా పురుషుల విభాగంలో అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, కృష్ణ, విజయనగరం, కృష్ణ, విజయనగరం, గుంటూరు జట్లు గెలుపొందగా, వీటిలో అనంతపురం, వియనగరం, చిత్తూరు, గుంటూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం మరికొన్ని లీగ్ పోటీలతో పాటు, క్వార్టర్స్, సెమీఫైనల్ పోటీలు జరగనున్నాయి. ఉత్కంఠంగా సాగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గుడ్ షపర్డ్ పాఠశాల డైరెక్టర్, డాక్టర్ ఇన్నారెడ్డి క్రీడాకారులకు వసతి, ఆహార సౌకర్యం ఏర్పాటుచేస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ జిల్లా కో-ఆర్డినేటర్ నరసింహారెడ్డి తెలిపారు.

రైలు ఎక్కబోతూ జారిపడి బీటెక్ విద్యార్థి మృతి



కొల్లి హర్షవర్ధన్ (ఫైల్)

దాచేపల్లి, ఆగస్టు 10: రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి బీటెక్ విద్యార్థి మృతిచెందిన సంఘటన తమిళనాడు రాష్ట్రం తిరుచ్చురై రైల్వేస్టేషన్ వద్ద జరిగినట్లు స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపారు. సేకరించిన వివరాలిలా వున్నాయి... పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురానికి చెందిన కొల్లి హర్షవర్ధన్(19) తిరుపతిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండవ శనివారం, ఆదివారం కలిసిరావడంతో స్నేహితులతో కలిసి దేవాలయానికి వెళ్లేందుకు రైలులో ప్రయాణం చేస్తున్నారు. మార్గమధ్యంలో రైల్వేస్టేషన్ వద్ద కిందకు దిగిన హర్షవర్ధన్ తిరిగి రైలు ఎక్కుతుండగా రైలు కదిలింది. ప్రమాదవశాత్తుగా జారి కిందపడిపోవడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి కొల్లి కోటేశ్వరరావు, తల్లి నాగమణి సామాన్య రైతు కుటుంబం. కోటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, చిన్నకుమారుడు చదువుతూ ప్రమాదవశాత్తు మృతి చెందడం కుటుంబసభ్యులను శోకసంద్రంలో ముంచింది. సమాచారం అందుకున్న మృతుడి స్నేహితులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలి

● విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు



మాట్లాడుతున్న దళిత క్రైస్తవ నాయకుడు, పాల్గొన్న విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10: 1950 ఆగస్టు 10న వెలువడిన రాజ్యాంగ ఆర్డర్‌లోని మూడో పేరాలో హిందూమతంలో దళితులకు మాత్రమే ఎస్సీ కోటా వర్తిస్తుందనే రాష్ట్రపతి ఉత్తర్వును రద్దుచేయాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు డిమాండ్ చేశారు. స్థానిక ఏసీ కళాశాలలో దళితులకెందుకు 'ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయి' అనే అంశం మీద శనివారం సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 14 చెప్పిన సమానత్వ హక్కును ఆర్టికల్ 16 చెప్పిన సమాన అవకాశాలను ఈ ఉత్తర్వు అడ్డుకుంటుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన విశ్వసించు, అనుసరించు, ప్రకటించు అనే హక్కును రాష్ట్రపతి ఉత్తర్వు కాలరాసిందని మండిపడ్డారు. దీనిపై 1950 ఆగస్టు 3న జరిగిన చర్చలలో డాక్టర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ ఇతర సభ్యులు కూడా రాష్ట్రపతి ఉత్తర్వును వ్యతిరేకించినట్టు గుర్తుచేశారు. ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ త్వరలోనే రాష్ట్రపతికి, ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కే మోజెస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పులిగుజ్జు సురేష్, హైకోర్టు న్యాయవాది గడ్డం ఎలీషా, విశ్రాంత ఎస్పీ కే రాజశేఖర్, శివశంకర్, సాల్మన్ వలంపర్తి, యూపీఎఫ్ ప్రెసిడెంట్ కర్ర జోసెఫ్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని బాలుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీచరణ్‌సాయి

గురవాయపాలెం(నరసరావుపేట రూరల్), ఆగస్టు 10: మండలంలోని గురవాయపాలెం వద్ద శనివారం కారు ఢీకొని ఈర్ల లక్ష్మీచరణ్‌సాయి (9) మృతి చెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మీ చరణ్‌సాయి రోడ్డుపై ఆడుకుంటుండగా కారు ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఈర్ల గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

బెల్లంకొండ, ఆగస్టు 10: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బెల్లంకొండ మండలంలోని కొత్తపాలెం గ్రామం వద్ద శనివారం జరిగింది. ఈ సంఘటనలో కొత్తపాలెం గ్రామానికి చెందిన మందా వెంకటేశ్వరరావు(41) మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మృతుడు మందా వెంకటేశ్వరరావు బంధువు వెంకటరావుకు చెందిన దమ్ము ట్రాక్టర్ దిగబడటంతో ఈ విషయం తెలుసుకున్న మృతుడు వెంకటేశ్వరరావు తనకు ఉన్న ట్రాక్టర్‌ను తీసుకొని దిగబడ్డ దమ్ము ట్రాక్టర్ వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను తాడుకు కట్టి లాగేందుకు ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ లంకలో పడిపోవటంతో వెంకటేశ్వరరావు ట్రాక్టర్ కిందపడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కొత్తపాలెం, బెల్లంకొండ గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహకారంతో ట్రాక్టర్ కిందపడి మృతిచెందిన మందా వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడిని చూడటానికి గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి భార్య నాగమణి, ఇరువురు కుమార్తెలు, ఇరువురు కుమారులు ఉన్నారు. మందా వెంకటేశ్వరరావు బెల్లంకొండలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.

రైళ్ల రీషెడ్యూల్.. దారి మళ్లింపు

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ వర్కుల కారణంగా రెండు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెం.17646 రేపల్లె-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13, 14 తేదీల్లో నాలుగు గంటల పాటు రీషెడ్యూల్ చేస్తున్నామన్నారు. నెం.17230 సికింద్రాబాద్ - త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 12, 13, 14 తేదీల్లో 75 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తామన్నారు. నెం.07221 సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్‌ని ఈ నెల 13న కాజీపేట, వరంగల్, విజయవాడ మీదగా దారి మళ్లిస్తున్నామన్నారు. నెం.22882 భువనేశ్వర్ - పూణే ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13న విజయవాడ, వరంగల్, కాజీపేట, సికింద్రాబాద్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. నెం.07222 సంత్రగచి-సికింద్రాబాద్ రైలు ఈ నెల 11న గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదగా ప్రయాణిస్తుందన్నారు. నెం.12805 విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 13, 14 తేదీల్లో 45 నిమిషాల పాటు మార్గమధ్యంలో క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు.

13, 14, 15, 16 తేదీల్లో నాలుగు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో నాలుగు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెం.07187 కాకినాడ టౌన్-సికింద్రాబాద్ రైలు ఈ నెల 13, 15 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నల్గొండ మీదగా మరుసటి రోజు ఉదయం 8.40కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెం.07188 సికింద్రాబాద్-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 14, 16 తేదీల్లో సాయంత్రం 6.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఉదయం 7.10కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

ఎమ్మెల్యేలతో మంత్రి పెమ్మసాని సమావేశం

● పార్టీ, నామినేటెడ్ పదవులపై ఎమ్మెల్యేలతో సమీక్ష

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం సాయంత్రం మంగళగిరిలోని జయభేరీ అపార్ట్‌మెంట్స్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌తో ఆయన పలు అంశాలపై సమీక్ష జరిపారు. ప్రధానంగా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులపై మంత్రి పెమ్మసాని ఎమ్మెల్యేలతో సమావేశమై చర్చించారు. కుల సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ, కూటమి ధర్మాన్ని దృష్టిలో పెట్టుకుని పదవుల కేటాయింపు జరిగేలా చూడాలని సమావేశంలో నిర్ణయించుకున్నట్లు సమాచారం. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారు, పార్టీని గెలిపించడంలో కీలకంగా వ్యవహరించిన వారికి ప్రాధాన్యం ఉండాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

ఐదేళ్లుగా సర్పంచులను జీరో చేసిన జగన్ ప్రభుత్వం

● సంఘ నాయకులతో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధికి సర్పంచులే కీలకమని, అలాంటి సర్పంచులను జగన్ ప్రభుత్వం జీరోలను చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఆయన సర్పంచుల సంఘ నాయకులతో సమావేశమయ్యారు. పక్కదారి పట్టిన నరేగా నిధుల వివరాలు, గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం, స్థానిక చెరువులు కూడా బాగు చేయించుకోలేని తమ దీనావస్థను సర్పంచుల సంఘ నేతలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులను దారి మళ్లించి గత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఇక నుంచైనా నరేగా నిధులను ఉపయోగించుకునేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులను, మ్యాచింగ్ ఫండ్స్‌ను అందిపుచ్చుకునేలా కృషి చేస్తున్నామని ఆయన వారితో చెప్పారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం పంచాయతీలపై మోపడాన్ని ఆయన తప్పుపట్టారు. చంద్రబాబు హయాంలో పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘ నాయకులు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ సిద్ధం : వనమా

గుంటూరు సిటీ, ఆగస్టు 10 : ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కరించేందుకు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధిని ప్రారంభించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ రాష్ట్ర నేతలు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని అన్నారు. నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం కోసం ప్రభుత్వానికి పంపుతారని వెల్లడించారు. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రతి నెల మొదటి సోమవారం, మూడో సోమవారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రతి నెల నాలుగో సోమవారం, నాలుగో మంగళవారం అందుబాటులో ఉంటారని, మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతి నెల మొదటి మంగళవారం, మూడో మంగళవారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రతి నెల మొదటి బుధవారం, రెండో బుధవారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రతి నెల మూడో బుధవారం, మూడో గురువారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు ప్రతి నెల మొదటి గురువారం, రెండో గురువారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రతి నెల నాలుగో బుధవారం, నాలుగో గురువారం అందుబాటులో ఉంటారని, ఎంపీ సీఎం రమేష్ ప్రతి నెల మొదటి శుక్రవారం, రెండో శుక్రవారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రతి నెల మూడో శుక్రవారం, మూడో శనివారం అందుబాటులో ఉంటారని, ఎమ్మెల్యే పార్థసారధి ప్రతి నెల నాలుగో శుక్రవారం, నాలుగో శనివారం అందుబాటులో ఉంటారని, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రతి నెల మొదటి శనివారం, రెండో శనివారం అందుబాటులో ఉంటారని, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రతి నెల రెండో సోమవారం, రెండో మంగళవారం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా రోజుల్లో ప్రజలు విజయవాడ వెళ్లి సమస్యలు నాయకుల దృష్టికి తీసుకువెళ్లవచ్చునని నరేంద్ర కుమార్ అన్నారు.

భరత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నటుడు పృథ్వీరాజ్

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు భీమనాథం భరత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో సినీనటుడు పృథ్వీరాజ్ పాల్గొన్నారు. భరత్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును శనివారం ఆయన ప్రారంభించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, మాజీ డిప్యూటీ మేయర్ నంబూరు గౌస్, వేమారెడ్డి, యర్రి సిద్దార్థ(బాజీ) తదితరులు భరత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నగరవాసులు మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకున్నారు. భరత్‌రెడ్డి యూత్, రెయిన్ బో హై బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంగడిగుంట యూత్, నిర్మల్ హృ దయ్‌లో, కొరిటెపాడు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతంలో, భరత్‌రెడ్డి నివాసం లో, గణేశ్ నగర్ యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, నటుడు పృథ్వీరాజ్, భరత్‌రెడ్డి, నంబూరు సుభాని

హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు అవకాశం ఇవ్వొద్దు

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఉద్బోధ

గుంటూరు (మెడికల్) ఆగస్టు 10: హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు అవకాశం లేని విధంగా యువత మంచి మార్గంలో పయనిస్తూ దృఢమైన సంకల్పంతో ముందుకు సాగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై యువతకు అవగాహన కల్పించేందుకు శనివారం అమరావతి రోడ్‌లోని చిల్లీస్ హోటల్ సెంటర్ నుంచి జేకేసీ కళాశాల రోడ్‌లోని ఆర్టీవో కార్యాలయం సెంటర్ వరకు 5కే మారథాన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ న్యాకో, ఏపీ శ్యాక్స్ సూచనల మేరకు యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ మారథాన్ పోటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం జరిగిన పోటీలో పురుషుల విభాగంలో కే.వర్ధన్ (హిందూ కాలేజీ), ఆర్.కార్తీక్ (పీఎఎస్ కాలేజీ), షేక్ మునీర్ (హిందూ కాలేజీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళా విభాగంలో పీ.చేతన, షేక్ పర్వీన్ (టీజేపీఎస్ కాలేజీ), టీ.బిందు (హిందూ కళాశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జేవీ సుధీర్, ఫిజికల్ డైరెక్టర్ శివాజీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.లక్ష్మానాయక్, డాక్టర్ శ్యామ్‌సన్, జే.వీరాస్వామి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



యువతను ఉద్దేశించి ప్రసంగిస్తున్న విజయలక్ష్మి

15న ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఆవిష్కరించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10 : అమర వీరులను స్మరించుకుంటూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవం, హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న తపాలా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందించేలా ప్రధాని మోదీ నిర్ణయం మేరకు ప్రతి తపాలా కార్యాలయంలో జాతీయ పతాకంను రూ.25కు అందుబాటులో ఉంచామని వివరించారు. గల్లా మాధవి మాట్లాడుతూ భారత దేశంలో పుట్టినందుకు మనం దరం గర్వించాలన్నారు. అంతకుముందు పెమ్మసాని, గల్లా మాధవి, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కె.ప్రకాష్‌తో కలసి తపాల కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ జనరల్ విజయవాడ రీజన్ డిఎస్‌విఆర్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఎం.జగదీష్ పాయి, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్, గుంటూరు డివిజన్ యు.యలమందయ్య, 23వ డివిజన్ కార్పొరేటర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మువ్వన్నెల జెండాను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి, పాల్గొన్న తపాల శాఖ ఉన్నతాధికారులు

సహస్ర ఆర్థో సెంటర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

● స్పోర్ట్స్ ఇంజ్యూరీ ఫెలోషిప్ కోర్సుకు అనుమతి



డాక్టర్ శివకుమార్

గుంటూరు (మెడికల్) ఆగస్టు 10: కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్‌లోని సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. మోకాలి, భుజం గాయాలు, క్రీడా గాయాలకు సంబంధించి ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సలలో దేశవ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ భారతదేశంలో 31 ఆసుపత్రులకు అనుమతివ్వగా, అందులో మన రాష్ట్రం నుంచి రెండు కేంద్రాలు ఈ గుర్తింపు సాధించాయి. విశాఖపట్నంలోని ఒక ఆసుపత్రితో పాటు గుంటూరులోని సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్ ఈ గుర్తింపు పొందటం విశేషం. ఇకపై తమ సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్‌లో ఆర్థ్రోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజ్యూరీస్ విభాగంలో ఆర్థోపెడిక్ సర్జన్లకు ఫెలోషిప్‌కోర్సులు ప్రారంభిస్తున్నట్లు సెంటర్ అధినేత, ఆర్థ్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి ప్రకటించారు. తాము ఇచ్చే సర్టిఫికెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు. దేశం నలుమూలల నుంచి ఆర్థోపెడిక్ సర్జన్లు వచ్చి గుంటూరులోని తమ వైద్యశాలలో ఈ ఫెలోషిప్ కోర్సులో చేరవచ్చని తెలిపారు.

ముగ్గురు తహసీల్దార్లకు కొలువులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):జిల్లాకు రీఎలాట్‌మెంట్ అయిన ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. పెదకాకాని తహసీల్దార్‌గా పీ.కృష్ణకాంత్, దుగ్గిరాల తహసీల్దార్‌గా ఐ.సునిత, తుళ్లూరు మండలానికి జీ.సుజాతని నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పెదకాకాని తహసీల్దార్‌గా నియమితుడైన గుంటూరు తూర్పు మండలానికి చెందిన పీ.నగేష్‌ని తూర్పు మండలంలోనే కొనసాగాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ పీ.శంకర్ బాబుని పెదనందిపాడు తహసీల్దార్‌గా నియమించారు. ఫిరంగిపురంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ జీ.నాంచారయ్యని బాపట్ల జిల్లాకు రీఎలాట్‌మెంట్ చేసి అక్కడ పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌ని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

నవతరం పూలే.. జస్టిస్ పుంజాల శివశంకర్

● ఏపీ స్టేట్ కాపు అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10 : సమాజంలో అట్టడుగు వర్గాలకు హక్కులు కల్పించడానికి కృషి చేసిన మహనీయుడు జస్టిస్ పుంజాల శివశంకర్ అని ఏపీ స్టేట్ కాపు అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ వి సత్యనారాయణ కొనియాడారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్టా) ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట ఓ కల్యాణమండపంలో శనివారం జస్టిస్ పుంజాల శివశంకర్ 95వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూట్ పాలిష్ నుంచి హైకోర్టు న్యాయమూర్తి వరకు పుంజాల శివశంకర్ ప్రయాణం స్ఫూర్తిదాయకమన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.చిదంబరం మాట్లాడుతూ న్యాయశాఖ మంత్రిగా పనిచేసే సమయంలో ఆయన అనేక న్యాయ సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావులు మాట్లాడుతూ శివశంకర్ చేసిన సేవలు, సంస్కరణలను విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి మార్కేండేయబాబు, ప్రసాదు, బీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్‌వీ సత్యనారాయణ

కేంద్ర ఆరోగ్య పథకం వెల్నెస్ సెంటర్‌కు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

● ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 10 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఏర్పాటు చేసిన సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్నెస్ సెంటర్‌కు మరిన్ని ఆరోగ్యపరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం కో ఆర్డినేటర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి కోరారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ తనిఖీకి శనివారం వచ్చిన పెమ్మసానిని కలిసిన ఆయన సమస్యలను వివరించారు. గుంటూరు వెల్నెస్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, ఇక్కడ అన్ని వైద్య, పరీక్షా సదుపాయాలు కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. నూతన జిల్లాల్లోనూ వెల్నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని మంత్రిని ఆయన అభ్యర్థించారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటానని పెమ్మసాని హామి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీజీహెచ్ఎస్ డాక్టర్లు ఎంసీహెచ్ కోటేశ్వరరావు, డి.తుకారామ్, బేగం అయోషు, రామారావు, మురళీ ఉన్నారు.



సన్మానగ్రహీతలైన జనసైనికులు, వీర మహిళలు

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న జనసేన పార్టీ

గుంటూరు, ఆగస్టు 10: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ జనసేన పార్టీ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో 500 నుంచి 1000 వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన జనసైనికులు, వీర మహిళలను పార్టీ తరపున ఘనంగా సన్మానించారు. వారికి శాలువా కప్పి ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా గాదె మాట్లాడుతూ తమ అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు లక్ష దాటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, పాకనాటి రమాదేవి, బిట్రగుంట మల్లిక, విజయ్‌శేఖర్, శిఖా బాలు, కొప్పుల కిరణ్‌బాబు, చట్టాల త్రినాద్, ఊస రాజేష్, తోట రాజా రమేష్, షేక్ కరిముల్లా, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మైనర్ సహా ఇద్దరు అరెస్టు

గుంటూరు, ఆగస్టు 10 : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వర్ణ భారతి నగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఓ మైనర్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నల్లపాడు సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో నల్లచెరువు ప్రాంతానికి చెందిన యంగలశెట్టి దుర్గాప్రసాద్ కొంతకాలంగా సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. అదేవిధంగా స్వర్ణభారతినగర్‌కు చెందిన 17 సంవత్సరాల బాలుడితో కలిసి విశాఖ జిల్లా సీలేరు ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు దాడి చేసి వారిరువురి వద్ద నుంచి రెండు కిలోల 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇరువురుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. సీఐ వంశీధర్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో పాత నిందితుల కదలికలపై కూడా నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులు..

స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అరండల్‌పేట మెయిన్ రోడ్డు ఆరు, ఏడు లైన్‌లలోని బడ్డీ కొట్లలో చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొరిటెపాడులోని హనుమయ్యనగర్ ప్రాంతానికి చెందిన షేక్ జానీ బాషా, జొన్నలగడ్డ యువరాజు, నాగసాయి, తమ్మిశెట్టి అంకమ్మరావు అనే నలుగురు యువకులు వారం రోజుల క్రితం అరండల్ పేట మెయిన్ రోడ్‌లో ఉన్న రెండు బడ్డీ బంకుల్లో తాళాలు పగలగొట్టి సిగరెట్లను అపహరించుకుపోయారు. ఈ మేరకు నమోదైన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు అరండల్‌పేట సీఐ కె శ్రీనివాసరావు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గుంటూరు, ఆగస్టు 10 : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని కొత్తపేట సీఐ ఎం.వీరయ్య హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన సిబ్బందితో కలసి స్టేషన్ పరిధిలో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆయా ప్రధాన రోడ్లలో ప్రజలకు భరోసా కలిగించే విధంగా తిరుగుతూ స్థానిక పరిస్థితులను అంచనా వేశారు. ఆయా రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వారిని అదుపులోకి తీసుకుని విచారించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ వీరయ్య కోరారు.



జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.భార్గవ్ తేజ శనివారం మర్యాద పూర్వకంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు. - గుంటూరు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10: మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు జి.సతీష్ బాబు, సుదురుపాటి పాదర్ చంద్రమోహన్ డిమాండ్ చేశారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులో 3వ పేరా తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ చర్చి వద్ద జాతీయ క్రైస్తవ నిరసన దినం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికపై అందరికీ సమానంగా రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అనంతరం సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ చర్చి నుంచి అంథోని చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు విల్సన్, చక్రధర్, ఆశీర్వాదం, మనోహర్, కర్రో హానిక్ బెంజిమెన్, కార్పొరేటర్ బూసి రాజ్యలత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య నీరాజనం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వారి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా శుభ గాత్రి ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, నాట్యాచార్యుడు బీరక సురేష్ బాబు, వారి శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. వీరికి నట్టువాంగం బీరక సురేష్ బాబు, గాత్రం సిహెచ్ శాంతి, బంకుపల్లి విద్యాసాగర్, నూజివీడు, వయోలిన్‌పై నాగేశ్వరరావు, మృదంగంపై వెంకట భరద్వాజ్, ఘటంపై ఎం.హరిబాబు, వేణువుతో వనమాలీ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాలను డాక్టర్ లలిత్ ప్రకాష్ చంద్ర, ముఖ్య అతిధి డాక్టర్ ప్రవీణ్ నల్లపాటి, ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం సంగీత మండలి సభ్యులు కళాకారులను, అతిధులను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

గుంటూరు, ఆగస్టు 10: బ్రాడీపేట 2/14వ లైనులోని నాగార్జున సాంస్కృతి కేంద్రం, నాగార్జున సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో శనివారం త్యాగరాజ స్వామి కళావేదికలో జరిగిన గాత్రకచేరి, వాయిలిన్ కచేరి ఆహుతులను ఆకట్టుకున్నది. గాత్రకచేరిలో ఎస్.శాంతి, సింగరాజు సత్య సాయి విజయలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జీ జస్టిస్ కేజీ శంకర్, నాగార్జున కల్చరల్ సెంటర్ కార్యదర్శి పిఎస్ఎన్ మూర్తి, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కార్యదర్శి డాక్టర్ కె సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

గుంటూరు(విద్య), ఆగస్టు 10 : శ్రీ ఆంజనేయ ధ్యానయోగ మండలి ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి అమరావతి రోడ్డు శ్రీవెంకటేశ్వర దేవస్థానం సమీపంలో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ బి.శివకుమార్ స్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసనాలు, ప్రాణాయామం, ఆహార నియమాలు, సూర్యనమస్కారాలు, సప్తరుషి వ్యాయామాలు, త్రినాథ నమస్కారాలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని, 8 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాలు వయసు ఉన్నవారు హాజరుకావచ్చునని తెలిపారు. వివరాల కోసం 9440712208లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తా

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్తులను, స్థలాలను పరిరక్షిస్తానని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని కోదండ రామయ్య నగర్, హౌసింగ్ బోర్డు ప్రాంతాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి పరిరక్షించడానికి ప్రహరీ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని రక్షించి ఆట స్థలం, ఉద్యానవనం వంటి ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తామని చెప్పారు. స్థలాన్ని రక్షించడం కోసం రూ.60 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎన్జీవో కాలనీ ప్రధాన రహదారిలో రూ.80 లక్షల అంచనాలతో సీసీ రోడ్డు, రూ.80 లక్షల వ్యయంతో కోదండరామయ్యనగర్‌లోని సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెల్లగొర్ల అప్పారావు, మామిడి రామారావు, శివ నాగమల్లేశ్వరరావు, కసుకుర్తి హనుమంతరావు, నల్లూరి శ్రీను, బత్తుల సాంబశివరావు, శివాజీ, రవి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

తాను చేసిన విధ్వంసంలోనే రాష్ట్రం ఉండాలని జగన్ కోరిక

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసి రాష్ట్రాన్ని తాను చేసిన విధ్వంసంలో ఉంచాలని జగన్‌రెడ్డి కోరుకుంటున్నాడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌రెడ్డి మాయ మాటలకు దళితులు ప్రభావితం కారనే విషయాన్ని గత ఎన్నికల్లో ఘోర ఓటమి ద్వారా జగన్ గమనించాలన్నారు. వివేకానందరెడ్డిని చంపి నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేసి అధికారాన్ని సాధించినట్లే విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై విద్వేష రాజకీయాలు జగన్ కొనసాగించాలని కోరుకుంటున్నాడన్నారు. అంబేడ్కర్‌పై జగన్ క్షుద్ర రాజకీయాలను దళితులు తిప్పికొట్టారని ఆయన అన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలను టీడీపీ వారు విధ్వంసం చేస్తారని ఆయన పత్రిక విద్వేష, కుట్రపూరిత రాతలు రాసిందని విమర్శించారు. వైసీపీ అల్లరి మూకలు, రౌడీలు, గంజాయి బ్యాచ్ దళితవాడల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు చేసి అసాంఘిక ఘటనలకు ప్రేరేపిస్తున్నారని ఆ రాతలను బట్టి అర్థమవుతోందని ఆయన అన్నారు.

అంబేద్కర్ పేరును స్మరించే అర్హత జగన్‌కు లేదు

● టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10 : అంబేద్కర్ స్మృతివనంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు తొలగించారని, దానిని అంబేద్కర్ స్మృతివనంపై దాడి అంటూ వైసీపీ నాయకులు చెప్పడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ మండిపడ్డారు. స్థానిక నగరంపాలెం, కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అసలు అంబేద్కర్ పేరును స్మరించే అర్హత జగన్‌కు లేదని విమర్శించారు. ఐదేళ్ల జగన్ పాలనలో దళితులపై దాడులు, అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేస్తుంటే కనీసం జగన్ స్పందించలేదని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి పొందేందుకు దళిత సంఘాల ముసుగులో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, పాముల పుష్పశ్రీవాణి రెచ్చగొట్టే కుట్రలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వైసీపీ నాయకులను రాష్ట్ర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.

క్రమశిక్షణ,సమరశీలతే యూటీఎఫ్ లక్ష్యం

● రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు జోజయ్య

● ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు(విద్య),ఆగస్టు 10: క్రమశిక్షణ, సమరశీలత ఉన్న నాయకత్వం, కార్యకర్తలతోనే యూటీఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రస్థానంలో నిలిచిందని యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కొండవీటి జోజయ్య అన్నారు. శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన 51వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జోజయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలతోపాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎఎన్ కుసుమకుమారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, సీనియర్ నాయకులు కెవిఎస్ దుర్గారావు, ఎన్.తాండవకృష్ణ, జి.వెంకటేశ్వర్లు, ఎఎల్ శివపార్వతి, జిల్లా కోశాధికారి సుదౌలా, సిహెచ్ ఆదినారాయణ, కె.కేదార్‌నాథ్, ఎం.కోటిరెడ్డి, కె ప్రేమ్‌కుమార్, ఎం.గోవిందయ్య, జివి ధనలక్ష్మి, కె.ప్రభాజి, జి.జితేంద్ర, షకీలా, ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత 51వ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరించి నగరంలో ర్యాలీ నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జోజయ్య, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన తరువాతే సర్దుబాటు నిర్వహించాలి

● ఏపీయుఎస్ విజ్ఞప్తి

గుంటూరు(విద్య), ఆగస్టు 10 : ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, జీవో నం 117 రద్దు చేయకుండా సర్దుబాటు నిర్వహించడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బాలచంద్రారెడ్డి, కె.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులకు వివిధ డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా జీవో నంబరు 117 రద్దు చేయాలని, పదోన్నతులు చేపట్టిన తరువాతే సర్దుబాటు నిర్వహించాలని కోరారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను విడివిడిగా చూపాలని, ప్రతి పాఠశాలలో కనీస విద్యార్థుల సంఖ్య 10 మంది కంటే ఎక్కువ ఉంటే ఇద్దరు ఉపాధ్యాయుల్ని కేటాయించాలని కోరా రు. ఆయా డిమాండ్స్ పరిష్కరించిన తరువాతే ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ మహిళా కన్వీనర్ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూఎస్ నాయకులు



ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఉయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'



నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీ.జె.మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.

'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్, కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.













తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కమిషనర్ శేషన్నతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

డంపింగ్ యార్డు పనులను ప్రారంభించండి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి, మారీసుపేట ఆగస్టు 10: పట్టణ శివారులోని డంపింగ్ యార్డ్ పనులను త్వరగా ప్రారంభించాని మున్సిపల్ కమిషనర్ బీ. శేషన్నను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం ఆయన పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆయన నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్గధంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, రోడ్లపై వేస్తున్న చెత్త, వ్యర్థాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అక్టోబరు కల్లా డంపింగ్ యార్డు తొలగింపు చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. డంపింగ్ యర్డుకు అనుకొని ఉన్న రోడ్లపై చెత్త వేయరాదని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాని, భద్రతాపరంగా స్థానిక వార్డు కౌన్సిలర్‌లను వలంటీర్లగా బాధ్యత తీసుకునేలా సంప్రదించాలని సూచించారు. పట్టణ సుందరీకరణ చర్యలకు ప్రతిపాదలను సిద్ధంచేయాలని, గ్రీనరీ, ప్లాంటేషన్ తదితర బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటే తెలియజేయాలని, పనులు మాత్రం ఆలస్యం కాకుండా చూడాలని అన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ సెప్టెంబరు లోపు టెండర్ల దశను పూర్తి చేయించి అక్టోబరు మొదటి వారంలో డంపింగ్ యార్డు పనులు ప్రారంభిస్తామని మంత్రి పెమ్మసానితో అన్నారు. సమావేశంలో వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



చిన్నారులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

బ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

తెనాలి అర్బన్, ఆగస్టు 10 : బ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన కృషి చేస్తామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నాజరుపేటలోని విద్యాశంకర భారతి సదన్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సమాఖ్య అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అధ్యక్షన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, కూటమి పాలనలో బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సదన్ ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్వీఆర్ శేషుకుమార్, కామరాజు రవి, కామేశ్వరరావు, సూర్యప్రకాష్, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

బ్రాహ్మణుల సంక్షేమానికి మేలు కలిగించేలా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటుందని బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు కోటా పార్థసారధి తెలిపారు. తెనాలి కొత్తపేటలోని పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ధూప దీప నైవేద్యం నిధులు రూ.10వేలు చేయడం, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం హర్షణీయమన్నారు. పేద బ్రాహ్మణులకు చేయూతనిచ్చేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. సాయికిరణ్, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, ధనుంజయ్, లక్ష్మణకుమార్, శివకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు తదితరులు

ఆర్యవైశ్య బాలికలకు ఉపకార వేతనాలు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 10: ఇంటర్‌మీడియట్‌లో ప్రతిభ చూపిన ఆర్యవైశ్య బాలికలకు ఉపకార వేతనాలను పంపిణీ చేస్తామని పట్టణ పురపాలక సంఘ మాజీ ఛైర్మన్, వైశ్యవిద్యానిధి కార్యదర్శి పెండేల వెంకట్రావు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని తెనాలి శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్‌లో 2023-2024వ విద్యా సంవత్సరంలో 951 మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ. 10 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. అర్హత కల్గిన ఆర్యవైశ్య బాలికలు తమ ఆధార్ కార్డు, మార్కులిస్ట్ సర్టిఫికేట్స్‌ల జెరాక్స్‌లను ఈనెల 31లోపు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు సుగ్గుల వెంకటప్పయ్య, కోశాధికారి పెండేల సుబ్బారావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సందేశాత్మక సినిమాల ప్రదర్శనలకు కృషి

● ఫిల్మ్ సొసైటీ రీజియన్ కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి

తెనాలి అర్బన్, ఆగస్టు 10: సమాజానికి మంచి సందేశం అందించే సినిమాలను ప్రదర్శించేందుకు కృషి చేస్తానని ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ రీజియన్ సెక్రటరీ బీఎల్ఎస్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. తెనాలి కల్చరల్ ఫిల్మ్ సొసైటీలో శనివారం ఆయన సొసైటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. దేశ విదేశాల నుంచి మంచి సినిమాలను ఎంపిక చేసి ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో వాటిని ప్రదర్శిస్తామన్నారు. ఇందుకోసం సొసైటీ సభ్యులతో చర్చిస్తున్నామన్నారు. ఓపెన్ ఫోరం పేరిట సమీక్షిస్తున్నామని, ఫిల్మ్ అప్రిషియన్ కోర్సు నిర్వహించడం, డాక్యుమెంటరీ తీసే విధానంపై ప్రోత్సహిస్తామన్నారు. ఫిల్మ్ క్లబ్‌లను ఏర్పాటు చేసి ఫిల్మ్ సొసైటీని ప్రజలు మెచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. తెనాలిలో ప్రతినెలా రెండు దేశ, విదేశీ చిత్రాలను ప్రదర్శించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రావిపాటి వీరనారాయణ, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

సినీ మాయగాళ్లతో అప్రమత్తం

తెనాలి అర్బన్, ఆగస్టు 10 : సినిమా అవకాశాలు కల్పిస్తామని చెప్పే మాయగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో సినిమా ఛాన్స్‌ల పేరుతో మోసగాళ్లు తిరుగుతున్నారని, అనుమానం వచ్చిన కొందరు నిర్ధారణ కోసం మా ఏపీ కార్యాలయాన్ని సంప్రదించారని అన్నారు. ఓటీటీ ప్లాట్‌ఫాం పేరిట విసురుతున్న వలకు అమాయకులు చిక్కుతున్నారని, సినిమా మోజులో పడి మోసపోకండని యువతకు సూచించారు.



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలేరియా అధికారులు

డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన

తెనాలి, మారీసుపేట ఆగస్టు 10: డెంగీ వ్యాధి నుంచి తగు జాగ్రత్తలను పాటించాలని తెలియజేస్తూ స్థానిక ఐతానగర్ హయ్యర్‌పేటలో శనివారం డెంగుపై అవగాహన కార్యక్రమాన్ని మలేరియా అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించాలని కోరారు. అనంతరం డెంగీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్తీతో కుస్తీ

● జ్వరాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
● రోజురోజుకి పెరుగుతున్న బాధితుల సంఖ్య
● మలేరియా, డెంగీ లక్షణాలతో ఆస్పత్రుల పాలు
● పరిశుభ్రత పాటించాలని వైద్యుల సూచన



తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో చికిత్సపొందుతున్న జ్వరపీడితులు

తెనాలి రూరల్, ఆగస్టు 10 : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు సుస్తీతో కుస్తీ పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలతో పాటు ఎక్కువగా మలేరియా, డెంగీ వంటి లక్షణాలతో అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు.

తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు గత నెల రోజులుగా జ్వర పీడితులు పెరుగుతున్నారు. పలు గ్రామాల్లో ఆర్ఎంపీ కేంద్రాలు, పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. సీజన్ మారి వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జ్వర పీడితులు పెరుగుతూ ఉన్నారు. ప్రతి రోజు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు జ్వరపీడితుల కేసులు దాదాపుగా 50 నుంచి 70వరకూ వస్తున్నాయని, వారిలో ఆసుపత్రిలో ఉంచి చికిత్స అందించాల్సి ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుంటున్నామని, సాధారణ జ్వరపీడితులకు తగిన మందులు ఇచ్చి తీసుకోవల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించి పంపడం జరుగుతుందని వైద్యశాల డాక్టర్ తిలికి వినీల్ తెలిపారు. గత నెలతో పోల్చుకుంటే ఈ నెల కొంత వరకూ తక్కువగానే కేసులు నమోదవుతున్నారని, వీటి శాతం పెరగక ముందే ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడేందుకు ప్రదానంగా అపరిశుభ్ర వాతావరణం, కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం, దోమకాటు వంటివి కారణాలుగా ఉంటాయన్నారు. గ్రామాల్లో ప్రజలు దోమకాటు బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తినకుండా ఉండటం మంచిదన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహించే హోటల్స్, పానీపూరి బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల వంటి వాటిలో ఆహారం ఎట్టి పరిస్థితుల్లో తినవద్దని హెచ్చరించారు. జ్వరం, నీరసం, వాంతులు, వికారం, ఆకలిలేకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమైన వారు తక్షణమే దగ్గరలోని వైద్యశాలను సంప్రదించి వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని, సొంతవైద్యం లేదా నిర్లక్ష్యం చేస్తే ప్రమాద స్థాయి తీవ్రతరమవుతుందన్నారు. మంచి ఆరోగ్యకరమైన జీవితం మన చేతుల్లోనే ఉంటుందని ఇంట్లో పరిశుభ్రమైన ఆహారం తీసుకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉండదని వినీల్ సూచించారు.



డాక్టర్ వినీల్



రక్తపరీక్షలకు క్యూ కట్టిన జ్వరపీడితులు

జాతీయ స్కాలర్‌షిప్ పరీక్షకు శిక్షణ

తెనాలి అర్బన్, ఆగస్టు 10 : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు అవసరమైన శిక్షణను అందించనున్నట్లు స్వచ్ఛంద సంస్థ మానవత ఛైర్మన్ కొలసాని రాంచంద్ తెలిపారు. ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి పరీక్ష జరిగే వరకు ప్రతి ఆదివారం మానవత సంస్థ ప్రాంగణం కుంచవరం గ్రామంలో నిర్వహిస్తామన్నారు. ఇందుకు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డిసెంబర్‌లో నిర్వహించే స్కాలర్‌షిప్ టెస్టులో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేలు ఉపకార వేతనం ఇస్తుందన్నారు. సమావేశంలో కటకం ప్రసాద్, శ్రీనివాసబాబు, వెంకట్, సోమయ్య శాస్త్రి, సాంబశివరావు, పరిమి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామారావు సేవలు చిరస్మరణీయం

తెనాలి రూరల్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెట్ జిల్లా అధ్యక్షుడిగా నాగుమోతు రామారావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు రమణయ్య అన్నారు. శనివారం మండలంలోని సంగంజాగర్లమూడిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భవనంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరి రమణయ్య అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా యూనియన్ అధ్యక్షుడు నాగుమోతురామారావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమణయ్య మాట్లాడుతూ నాగుమోతు రామారావు సేవలను కొనియాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు వీ. సుబ్బారావు, నాగుమోతు శ్రీనివాసరరావు, ఎం. కోటేశ్వరరావు, వి.సాంబశివరావు, కొత్త శ్రీనివాసరరావు, కే.శరాబందిరాజు, ఎం. రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న అర్బన్ సీఐ భాస్కర్

హత్య కేసులో నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన అర్బన్ సీఐ భాస్కర్

పొన్నూరుటౌన్, ఆగస్టు 10: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఇటీవల జరిగిన హత్య కేసులో నిందుతులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ భాస్కర్ శనివారం తెలిపారు. ఇటీవల పట్టణంలోని ఎరుకులవాడకు చెందిన పిట్లా హిమబింధు(20), భర్త, అత్త చేతిలో కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చేరింది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ హిమబింధు శుక్రవారం రాత్రి మృతి చెందింది.ఈ సంఘటనలో హిమబింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హిమబింధు భర్త పిట్లా నాగేంద్రకుమార్ చేసిన అప్పుల నిమిత్తం హిమబింధు పేరుపై ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి అప్పు తీసుకోవడానికి కోరగా హిమబింధు తిరస్కరించింది. అంతే కాకుండా హిమబింధు మరోకరితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు అత్త రమాదేవి, కుమారుడు నాగేంద్రకుమార్‌కు తెలిపింది. అయితే ఈ నెల 7న హిమబిందుపై ఒత్తిడి చేయడంతో ఘర్షణ జరిగి భర్త నాగేంద్రకుమార్, అత్త రమాదేవి హిమబింధుపై కత్తితో దాడి చేశారు. హిమబింధు పొట్టపై కత్తి గాయాలు కాగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో హిమబిందును గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హిమబిందు మృతి చెందింది. ఈ సంఘటన పై నిందితులు పిట్లా నాగేంద్రకుమార్, రమాదేవిలను అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరచినట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

ముగ్గురు తహసీల్దార్లకు కొలువులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రీఎలాట్‌మెంట్ అయిన ముగ్గురు తహసీల్దార్లకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. పెదకాకాని మండల తహసీల్దారుగా పీ.కృష్ణకాంత్, దుగ్గిరాలకి ఐ.సునీత, తుళ్లూరుకి సుజాతను నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పెదకాకాని తహసీల్దారుగా నియమితులైన గుంటూరు తూర్పు మండలానికి చెందిన పీ నగేష్‌ని అక్కడే కొనసాగాల్సిందిగానూ, ఏపీ సెక్రెటేరియట్ సెక్షన్ ఆఫీసర్ పీ.శంకర్‌బాబుని పెదనందిపాడు తహసీల్దార్‌గానూ, ఫిరంగిపురం తహసీల్దార్ జీ.నాంచారయ్యని బాపట్ల జిల్లాకు రీ ఎలాట్ చేసి అక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌ని ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.



విరాళాలు స్వీకరిస్తున్న ప్రజా నాట్యమండలి నాయకులు

వయనాడ్ బాధితులను ఆదుకోండి

పొన్నూరుటౌన్, ఆగస్టు 10: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో ఇటీవల భారీ, వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. శనివారం పొన్నూరు పట్టణంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ఐలాండ్ సెంటర్ నుంచి ఎస్‌వీపీ రోడ్డు, కసుక్రు రోడ్డు మీదగా ప్రజా నాట్యమండలి కళాకారులు గీతాలాపనలు చేస్తూ విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు గంటా రాజేంద్రకుమార్, దేవరకొండ శ్రీనివాస్, చిట్టిబాబు, భరత్‌కుమార్, హనీఫ్ ఏ.నవదీప్, సాత్విక్, చైతన్య, దాసరి అంకయ్య, చింతా వాసు, తదితరులు పాల్గొన్నారు.


నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు

తెనాలి అర్బన్, ఆగస్టు 10 : నాజరుపేటలోని అఖిలాంధ్ర సాధుపరిషత్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నాయని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిషత్ పూర్వ కార్యదర్శి ప్రణవానంద భారతి శనివారం ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, 60 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంపై మరో అంతస్తు నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాతల నుండి పెద్ద మొత్తంలో విరాళాలు సేకరించి ఏకపక్షంగా పరిషత్ అధ్యక్షురాలు వ్యవహరిస్తున్నారని విచారణచేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ నారాయణ పాల్గొన్నారు.

తెలుగు భాషా పురస్కారానికి

నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి ఎంపిక

తెనాలిరూరల్, ఆగస్టు 10: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఈనెల 18న అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ కళావేదిక ప్రదానం చేయుచున్న తెలుగు భాషా పురస్కారానికి తెనాలి మండలం కొలకలూరుగ్రామానికి చెందిన డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఎంపికైనట్లు ఆయన ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఇప్పటి వరకూ తాను స్వీకరించిన పురస్కారాలలో తెలుగు భాషా పురస్కారం చాలావిలువైనదని అటువంటి ఉత్తమ పురస్కారం తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు.



డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారి

రోడ్ల వెంటే వ్యర్థాలు

● దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
● అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని విన్నపం

కొల్లిపర, ఆగస్టు 10 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సంకల్పం వైపు అడుగులు వేద్దామని ప్రభుత్వాలు పిలుపు ఇస్తుంటే గ్రామీణ ప్రాంతాలు అందకు భిన్నంగా ఉన్నాయి. గ్రామాల్లో గృహాల నుంచి వచ్చిన వ్యర్థాలు, రోడ్లపైన ఉన్న చెత్తను ఒక చోటే చేర్చేందుకు కంపోస్టుయార్డులు ఏర్పాటు చేశారు. కంపోస్టు యార్డులుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాలు ఆదేశించిన ఎక్కడ ఆమలు కావడం లేదు.

కొల్లిపర మండల పరిధిలో పలు గ్రామాల్లో ప్రయాణించాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను రహదారుల ప్రక్కనే పడవేయడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. మేజర్ పంచాయతీల్లో సేకరించిన వ్యర్థాలను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఊరికి శివారులో ఉన్న ప్రాంతాలకు తరలించి రోడ్డు ప్రక్కనే పారబోస్తున్నారు. వ్యర్థాలలో వరాహాలు, మూగజీవాలు సంచరిస్తుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అంతే కాకుండా సేకరించిన పొడి చెత్తను తగల బెడుతుండటంతో రహదారి మొత్తం పొగ అవరించి దారి కనిపించకుండా పోతోంది. దీంతో వాహనదారులు ఏ మాత్రం అదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మండల పరిధిలో అత్తోట నుంచి యాదవపాలెం వెళ్ళే రోడ్డు, దంతలూరు నుంచి మున్నంగి వెళ్ళే రోడ్డు, మున్నంగి నుంచి వల్లభాపురం వెళ్ళే రోడ్డు, తూములూరు నుంచి దావులూరు వెళ్ళే రోడ్డులో వ్యర్థాలు పారబోస్తుండటంతో రోడ్లు మూసుకుపోతున్నాయి. దీంతో ఈ రోడ్లపై వెళ్ళాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వ్యర్థాలపై అనేక పర్యాయాలు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దంతలూరు సమీపంలో రోడ్డు ప్రక్కన పోసి ఉన్న వ్యర్థాలు



అర్జీలు స్వీకరించి సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

మంత్రి మనోహర్‌కు వినతుల వెల్లువ

తెనాలి రూరల్, ఆగస్టు 10: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్లమనోహర్‌కు నియోజవర్గ ప్రజల నుంచి పలువినతులు అందాయి. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో మనోహర్‌ను కలిసి వారి సమస్యలను విన్నవించారు. తెలిపిన ప్రతి సమస్యను ఆలకించిన మంత్రి మనోహర్ త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల గౌరవాన్ని దెబ్బతీసిన వైసీపీ

● కూటమి ప్రభుత్వంతో తిరిగి వ్యవస్థకు పెరుగుతున్న విలువ

● టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లిమురళి

తెనాలి రూరల్, ఆగస్టు 10: వైసీపీ ఐదేళ్ల పాలనలో శాంతి భద్రతలు కాపాడేందుకు ఉన్న పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని పూర్తిగా దెబ్బతీసి, అధికారులను నేతల తొత్తులుగా దిగజార్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి విమర్శించారు. గత ఐదేళ్ల జగన్ పాలన చూస్తే ఆంధ్ర రాష్ట్రం కాస్త గంజాయి రాష్ట్రంగా మారిందని ఆరోపించారు. గంజాయి వంటి వాటిని అరికట్టి రాష్ట్రంలోని యువకుల భవిష్యత్తును కాపాడాల్సిన పోలీస్ యంత్రాంగాన్ని కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేసిందని ఆక్షేపించారు. గంజాయి, అక్రమ మద్యం, ఇతర నిషేధిత మత్తు పదార్థాల మూలాలను పట్టుకుని శిక్షించిన దాఖలాలు లేవని ఫలితంగానే రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని ఘాటుగా విమర్శించారు. తెనాలి ప్రాంతంలో యువకులనే టార్గెట్‌చేసి గంజాయి అమ్మకాలు జరిపారంటే ఇంతకన్నా దారుణమైనపాలన ఎక్కడా ఉండదన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతోనే రాష్ట్రానికి పట్టిన పీడ విరగడయిందని తెలిపారు. విలువలు కోల్పోయిన వ్యవస్థలను సైతం తిరిగి సీఎం చంద్రబాబు హయాంలో గాడిలో పెట్టారన్నారు. గంజాయి రహిత సమాజాన్ని స్థాపించేందుకు కట్టుబడి ఉన్నానని చంద్రబాబు చెప్పిన మాటలను నెరవేరుస్తూ రాష్ట్రంలో పోలీస్ యంత్రాగాన్ని అప్రమత్తం చేసి గంజాయి అన్న పదం ఎక్కడా వినపడకూడదని ఆదేశాలిచ్చారని తెలిపారు. సీఎంగా బాధ్యతలుచేపట్టిన అతి స్వల్పకాలంలోనే రాష్ట్రంలో గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపారని ఇప్పుడిప్పుడే ఆ వ్యవస్థపై తిరిగి ప్రజల్లో నమ్మకం కలుగుతుందన్నారు. తెనాలి ప్రాంతంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్లమనోహర్‌ల ఆదేశాలతో గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రాంగం శ్రమిస్తుందన్నారు.

ఆర్వీఐటీలో టెక్నికల్ ఫెస్ట్

చేబ్రోలు, ఆగస్టు 10: చేబ్రోలో ఆర్వీఐటీ కళాశాలలో శనివారం కల్చరల్ అండ్ టెక్నికల్ ఫెస్ట్ సందడిగా జరిగింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో ఇన్నోవేటివ్ ఐడియా ప్రోగ్రాం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఆర్వీ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య శ్రీధర్, కన్వీనర్ డాక్టర్ దినేష్‌బాబు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



శెట్టి గోపి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

శెట్టి గోపి మృతి బాధాకరం

● ఎమ్మెల్యే, సంగం డెయిరి ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, ఆగస్టు 10 : పట్టణానికి చెందిన శెట్టి గోపి మృతి బాధాకరమని ఎమ్మెల్యే, సంగం డెయిరి ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ శెట్టి గోపి మృతి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనతరం గోపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆకుల శివయ్య, మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, పఠాన్ అహ్మద్ ఖాన్, యక్కటి పద్మారావు, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షురాలు కుసుమకుమారి

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

● యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షురాలు కుసుమకుమారి

చేబ్రోలు, ఆగస్టు 10: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పై 50 ఏళ్లగా యూటీఎఫ్ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర సహ అధ్యక్షురాలు కుసుమకుమారి అన్నారు. చేబ్రోలు యూటీఎఫ్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన లగడపాటి కృష్ణ స్వరూప్ మీటింగ్ హాల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం కృష్ణ స్వరూప్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కుసుమకుమారి మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. యూటీఎఫ్ ఉద్యమ నేతల త్యాగాల ఫలితమే నేటి ఉపాధ్యాయుల అనుభవిస్తున్న సౌకర్యాలు అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం ద్వారానే సామాజిక న్యాయం పరిరక్షణ సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలహీన పడడానికి కారణమైన జీవో 117 రద్దు చేయాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ మాజీ ఛైర్మన్ తాండవకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఐక్య పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కళాధర్, రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కృష్ణ స్వరూప్, కస్తూరి వేణుగోపాల్, కోటయ్య, యూటీఎఫ్ నాయకులు దయాసుద్దీన్, నాగేశ్వరరావు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మత స్వేచ్ఛ కావాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 10: షెడ్యూల్డ్ కులాల వారికి సంపూర్ణ మత స్వేచ్ఛ అవసరమని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ జోసెఫ్ మొసిగంటి శనివారం అన్నారు. 1950 ఆగస్టు 10న షెడ్యూల్డ్ కులాల ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా ఎస్సీలకు సంపూర్ణ మత స్వేచ్ఛ తీసివేశారన్నారు. 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఎస్సీలకు మత ప్రమేయం లేకుండా రిజర్వేషన్ కల్పించాలని సూచించిందన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ కూడా సరైన న్యాయం చేయలేదని ఆరోపించారు. 2019లో మొదటి సారి ముఖ్యమంత్రి చంద్రబాబు మతం మారిన షెడ్యూల్డ్ కులాల వారికి రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిచారని గుర్తు చేశారు. నరేంద్రమోదీ సారధ్యంలో కూటమి మాత్రమే షెడ్యూల్ కులాల వారికి సంపూర్ణ మత స్వేచ్ఛ ఇచ్చి న్యాయం చేయగలదని నమ్ముతున్నట్లు డాక్టర్ జోసెఫ్ మొసిగంటి తెలిపారు.



డాక్టర్ జోసఫ్